సాక్షి
జగిత్యాల
శుక్రవారం | 30 | మే | 2025





## కనిపించని తనిఖీలు

జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో రెండు రోజుల క్రితం ఇడ్లీ, వడ, దోశ తిన్న బాధితులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. 8లో▸




## నేరాల నియంత్రణకు చర్యలు

జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం నేర సమీక్ష నిర్వహించారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
37.0/26.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఈదురుగాలులు వీస్తాయి.

# అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

అనర్హులకిస్తే.. అధికారులపై చర్యలు తప్పవు ● ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, డాక్టర్ సంజయ్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్‌కుమార్ ఝా, సత్యప్రసాద్, కరీంనగర్, రామగుండం కార్పొరేషన్ కమిషనర్లు చాహత్ బాజ్‌పేయ్, అరుణశ్రీ తదితరులు

- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం
- రైతులకు ఎరువులు, విత్తనాల కొరత రాకూడదు
- కలెక్టర్లూ.. మరో వారంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి
- నాలుగు జిల్లాల సమీక్షలో మంత్రి

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఇందిరమ్మ ఇళ్లను అర్హులకే కేటాయించాలని.. అనర్హులకు ఇస్తే అధికారులపై చర్యలు తప్పవని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, ధాన్యం కొనుగోలు వానాకాలం పంటలసాగు సన్నద్ధతపై కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి రివ్యూ నిర్వహించారు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి. ఖరీఫ్ సీజన్‌లో ఎస్సారెస్పీ నీటి విడుదల ప్రణాళికలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలను భాగస్వామ్యం చేస్తాం. ఎస్సారెస్పీ సామర్థ్యం సిల్ట్ కారణంగా తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం పాలసీ ప్రకారం ఎస్సారెస్పీ రిజర్వాయర్ పూడికతీత, డీసిల్టేషన్ ఆధునిక పద్ధతుల్లో పూర్తిచేసి పూర్వపు సామర్థ్యం తీసుకొస్తాం. కడెం ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో సిల్ట్ తొలగించేందుకు అత్యాధునిక పద్ధతులను వినియోగిస్తాం. కరీంనగర్ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తా.. ఇందుకు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సహకారంతో ముందుకు వెళ్తా. సింగరేణి భూముల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. బండ్ల వాగు ఎత్తిపోతల పథకాన్ని వారం రోజులలో ప్రారంభిస్తాం. పాలకుర్తి ఎత్తిపోతల పథకం పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

- రోళ్లవాగు ప్రాజెక్టు అటవీ అనుమతులు వచ్చేలా ఉన్నతాధికారులతో జగిత్యాల కలెక్టర్ నిరంతరం సంప్రదింపులు చేయాలని మంత్రి సూచించారు. నారాయణపురం రిజర్వాయర్, కొండగట్టు ఎత్తిపోతల పథకం, కలికోట సూరమ్మ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలుచేస్తుందన్నారు. కలెక్టర్లు మరోవారం కొనుగోలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవసరమైనమేర ధాన్యం రవాణా కోసం వాహనాలు సిద్ధం చేసుకోవాలని.. లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు వాడాలన్నారు. దేశంలో మొదటిసారిగా తెలంగాణలోని 84 శాతం జనాభాకు ఉచితంగా ఆరుకిలోల సన్నబియ్యం అందజేస్తున్నట్లు తెలిపారు. దేశ చరిత్రలోనే ఇది విప్లవాత్మక పథకమని.. దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదే అని తెలిపారు.

**ఇళ్ల స్థలాలపై ఆందోళన వద్దు..**

మీడియా మిత్రులకు ఎస్సారెస్పీ సమీపంలో అందుబాటులో ఉన్న భూములు పంపిణీకి ఉన్న సమస్యలు పరిష్కరించి త్వరలోనే ఇంటి పట్టాలు కేటాయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ మీడియా మిత్రులు ఇండ్ల పట్టాల పంపిణీ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో చర్చించి త్వరలో పట్టాలు అందించే కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు.

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ..** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగిందన్నారు. అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.51 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అకాల వర్షాలతో రైతుల నష్టపోకుండా అవసరమైన టార్పాలిన్ కవర్లు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని అధికారులను కోరారు. భూ భారతి చట్టంతో పట్టాదారులకు ఎటువంటి నష్టం రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..** గత పాలకుల హయాంలో రైస్ మిల్లులవద్ద తూకం పేరుతో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎక్కడా ఇబ్బంది లేదన్నారు. మలకపేట, సూరమ్మ, మోతె నారాయణపూర్, గౌరవెల్లి, దేవాదుల వంటి ప్రాజెక్టుల పనులు స్పీడప్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలోకి భూపాలపల్లి, హనుమకొండ, సిద్దిపేట జిల్లాలు వస్తాయని.. ఆయా జిల్లా కలెక్టర్లను సైతం సమీక్ష సమావేశాలకు ఆహ్వానించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, చింతకుంట విజయ రమణా రావు, డాక్టర్ సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశ్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, సందీప్ కుమార్ ఝా, సత్య ప్రసాద్, పెద్దపల్లి అదనపు కలెక్టర్ జె.అరుణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీ దరఖాస్తులకు వేళాయె | వివరాలు 8లో | శాతవాహనలో న్యాయ విద్య

## న్యూస్‌రీల్

### పార్టీ మారే స్వేచ్ఛ కవితకుంది

● మాజీమంత్రి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: పార్టీ మారే స్వేచ్ఛ కవితకు ఉందని, అయితే ఆమె పార్టీ మారుతుందని తాను భావించడం లేదని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. ఆమె పార్టీ పెడితే ఎమ్మెల్యేలు వెళ్తారన్న గ్యారంటీలేదని, వారేమీ అంగట్లో సరుకు కాదని పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నంత మాత్రాన కవిత పార్టీ మారుతుందని తాను భావించడం లేదన్నారు. వరికి క్వింటాల్‌కు రూ.69 పెంచి కేంద్రం ఆర్భాటం చేయడం సరికాదని రూ.500 పెంచితే తాము సంబరాల్లో పాల్గొంటామని తెలిపారు. రుణమాఫీ చేయాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు తప్ప మరో పార్టీకి రాలేదన్నారు. పీసీసీ కార్యదర్శి బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, జున్ను రాజేందర్ పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులు రానీయొద్దు



ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షిస్తున్న సీఈవో

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలని సూచించారు. లీకేజీ మరమ్మతుకు ఉపాధి హామీ నిధులు వినియోగించుకోవాలన్నారు. మహిళా సంఘాలతో ఆయిల్ బాల్స్ తయారు చేయించి నిల్వ నీరులో వేయించాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించాలని పేర్కొన్నారు. ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, ఎంపీవో జగదీష్, మండల వైద్యాధికారి వాహిని, పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్ అధికారులు పాల్గొన్నారు.

### కూలీలకు రూ.307 వచ్చేలా చూడాలి

సారంగాపూర్: ఉపాధి కూలీలకు రోజుకు రూ.307 వేతనం అందేలా పనులు చేయించాలని పథకం జిల్లా విజిలెన్స్ అధికారి దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెంబట్ల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లోని అటవీప్రాంతాల్లో జరుగుతున్న కందకాల పనులు, గొర్రెలు, గేదెలు, కోళ్ల పెంపకం షెడ్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏపీవో శ్రీలత, టీఏ స్వప్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.

# కోరుట్లలోనే నవోదయ

- ఈ విద్యాసంవత్సరమే తరగతులు
- తాత్కాలిక భవనం ఏర్పాటు



నవోదయ స్కూల్ తాత్కాలిక భవనం

కోరుట్ల: ప్రతిష్ఠాత్మకమైన కేంద్రీయ నవోదయ పాఠశాల కోరుట్లలోనే ఏర్పాటు కానుంది. ఈ మేరకు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఫైనల్ చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తాత్కాలిక భవనంలో తరగతులు ప్రారంభించాలని జవహర్ నవోదయ ఉమ్మడి కరీంనగర్ ప్రిన్సిపాల్‌కు నవోదయ విద్యాలయాల హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ గోపాలకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల ఏర్పాటుకు అవసరమైన వసతుల కల్పనకు నవోదయ అధికారులు జగిత్యాల కలెక్టర్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ ఉత్తర్వులతో ఇప్పటివరకు నవోదయ పాఠశాల ఏర్పాటు విషయంలో కొనసాగిన సస్పెన్షన్‌కు తెరపడినట్లయ్యింది.

**జిల్లా నేతల ఆశలు హుళక్కి**

ఎంపీ అర్వింద్ కృషితో ఆరు నెలల క్రితం పార్లమెంట్ పరిధిలో రెండు నవోదయ విద్యాలయాలు మంజూరయ్యాయి. వీటిలో ఒకటి నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లాకు కేటాయించారు. ఈ పాఠశాలను ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంలో చిక్కు వచ్చి పడింది. జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల అసెంబ్లీ స్థానాలు ఉండగా.. నవోదయ విద్యాలయాన్ని జగిత్యాల, ధర్మపురి పరిధిలో ఏర్పాటు చేయాలని ఆయా నియోజకవర్గ కీలక నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఒక దశలో జిల్లా కేంద్రం లేదా పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో ఏర్పాటు కానుందన్న ప్రచారం జరిగింది. సుమారు ఆరు నెలల పాటు ఈ విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చివరికి కోరుట్లలో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ రావడంతో కీలక నేతల పెట్టుకున్న ఆశలు నీరుగారిపోయాయి.

**ఈ విద్యాసంవత్సరమే..**

కోరుట్లలో ఏర్పాటుకానున్న నవోదయ విద్యాలయంలో ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి తాత్కాలికంగా పట్టణంలోని వేములవాడ రోడ్‌లో ఉన్న వసతి గృహంతోపాటు నెల క్రితం వరకు కొనసాగిన అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు ఉన్న భవనాన్ని కేటాయించారు. ఈ భవనాల్లో తరగతులు ప్రారంభించనున్నారు. శాశ్వత భవనం కోసం పట్టణంలోని జంబి గద్దెల వద్దగల 923 సర్వే నంబర్‌లో 23 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.

**పుట్టిన గడ్డపై మమకారం..**

ఎంపీ అర్వింద్ అమ్మమ్మది కోరుట్ల. ఇక్కడే బురుజు కూరగాయాల మార్కెట్ సమీపంలోగల ఆయన అమ్మమ్మ ఇంట్లో జన్మించారు. చిన్నతనంలో పాఠశాల సెలవుల్లో ఇక్కడికి వచ్చినప్పుడల్లా పరిసర ప్రాంతాల వారితో గడిపేవాడు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అర్వింద్ కోరుట్ల నుంచి పోటీ చేసిన సమయంలోనూ తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి పాత జ్ఞాపకాలను మననం చేసుకుని చుట్టుపక్కల వారందరిని పలకరించి ఆప్యాయతను చూపారు. ఈ క్రమంలోనే జగిత్యాల, ధర్మపురి ప్రాంతాల్లోని కీలక నేతలు నవోదయ పాఠశాలను తమ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని పంతాలకు వెళ్లినా అర్వింద్ మాత్రం పుట్టిన గడ్డకు ప్రాధాన్యం ఇచ్చి కోరుట్లలో నవోదయ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం**

కోరుట్లకు నవోదయ మంజూరు చేసిన ఎంపీ చిత్రపటానికి బీజేపీ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబు, ఓబీసీ ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, జిల్లా పదాధికారులు వడ్డేపల్లి శ్రీనివాస్, కస్తూరి లక్ష్మీనారాయణ, తులసి కృష్ణ ఉన్నారు.

### ఈ విద్యాసంవత్సరమే ప్రారంభం



కోరుట్లలో నవోదయ విద్యాలయం ఈ విద్యా సంవత్సరమే ప్రారంభం అవుతుంది. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ఈ పాఠశాల ఎంతగానో ప్రయోజకరంగా ఉంటుంది. పాఠశాల శాశ్వత భవనం నిర్మాణం, ఇతర వసతుల కల్పనకు ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే చర్యలు చేపడతాం.

– ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ ఎంపీ

# పసుపు బోర్డు ఏర్పాటుపై సంబరాలు

జగిత్యాలటౌన్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పసుపుబోర్డు కార్యాలయం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు గురువారం జిల్లాకేదంద్రలోని తహసీల్ చౌరస్తాలో ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి మాట్లాడుతూ.. బోర్డు ఏర్పాటుకు సహకరించిన ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, నలువాల తిరుపతి, కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, దశరథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాల అనుమతులకు బిల్డ్ నౌ

● ఏఐ ఆధారిత వ్యవస్థతో.. ● కొత్త విధానం ప్రారంభం

BuildNow
Building Telangana's Tomorrow!

బిల్డ్ నౌ నమూనా చిత్రం

జగిత్యాల: భవనాల నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులకు ఆధునాతన సాంకేతికతతో రూపొందించిన బిల్డ్ నౌ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. గత నెలలోనే మెట్రో నగరంలో ఏఐ సాంకేతికతతో ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. తాజాగా మున్సిపాలిటీల్లోనూ అమలవుతోంది. కృత్రిమ మేధా సాంకేతికతతో ఇంటి నిర్మాణ అనుమతులు పొందడంలో సులువుగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. గతంలో మున్సిపాలిటీల్లో టీఎస్ బీపాస్ ఉండేది. ఇంటి అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఉన్నాయన్న నేపథ్యంలో ఆ విధానాన్ని రద్దు చేసి బిల్డ్ నౌ తీసుకొచ్చింది. ఏఐ ఆధారిత వ్యవస్థతో బ్లాక్ చైన్, రియాల్టీ, ఆటోమేషన్ వంటివి తీసుకొచ్చారు. ఇందులో ఇంటి నిర్మాణ స్థలం, లేఅవుట్ సరిహద్దులను తెలుసుకునేందుకు జీపీఎస్ ఆధారిత పటాలను పొందుపర్చాల్సి ఉంటుంది. అంతేకాకుండా మన ఇంటి నిర్మాణ దరఖాస్తు ఏ స్టేజీలో ఉందని వాట్సాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఏవైనా తప్పుడు దరఖాస్తులు చేసుకున్నా మళ్లీ సవరించుకునే అవకాశం కల్పించారు. భవన నిర్మాణాలకు సంబంధించి పరిశీలనకు వెళ్తే ఏఐ ఆధారంగా రెండు నిమిషాల్లో ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. వీడియో ద్వారా వీక్షించే అవకాశం ఉంది. ఇందులో హిందీ, తెలుగు, ఉర్దూ భాషల్లో ఉంది.

**అనుమతి 15 రోజుల్లోనే...**

500 చదరపు మీటర్లలోపు భవనం నిర్మాణం చేపడితే 15 రోజుల్లోనే అనుమతులు జారీ చేయనున్నారు. 500కు పైగా ఉంటే 21 రోజుల్లో ఇవ్వాల్సి ఉంటుంది. అధికారులు ఈ మేరకు గురువారం నుంచి బిల్డ్ నౌ ద్వారానే అనుమతులు జారీ చేస్తున్నారు.

### ఏఐ సాంకేతికతతో



ఏఐ సాంకేతికతతో బిల్డ్‌నౌ విధానంలో ఇంటి అనుమతులు ఇవ్వనున్నాం. పాత టీఎస్ బీపాస్ రద్దు అయింది. ప్రస్తుతం జిల్లాలో ఈ కొత్త బిల్డ్‌నౌ ద్వారానే అనుమతులు లభించనున్నాయి.

– శ్రీనివాస్, టీపీవో

## క్లుప్తంగా

### క్షణికావేశంలో తండ్రిని హత్య చేసిన కొడుకు


గంగారెడ్డి (ఫైల్)

మేడిపల్లి: క్షణికావేశంలో కన్న కొడుకే తండ్రిని దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన మేడిపల్లి మండలకేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, మేడిపల్లి ఎస్సై సుప్రియ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన అంగడి నర్సయ్య అలియాస్ గంగారెడ్డి (56) తాగివచ్చి కొడుకు వెంకటేశ్‌తో ఘర్షణ పడ్డాడు. దీంతో క్షణికావేశంలో వెంకటేశ్ దగ్గరలో ఉన్న ఇనుప వస్తువుతో తండ్రి తలపై బలంగా కొట్టాడు. ఈ ఘటనలో గంగారెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. అనంతరం వెంకటేశ్ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. నర్సయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు సంతానం. కొడుకు వెంకటేశ్ ఇటీవలే గల్ఫ్ వెళ్లి తిరిగి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. వెంకటేశ్‌కు ఇంకా పెళ్లి కాలేదు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ, ఎస్సై వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

### కరీంనగర్–నిజామాబాద్ రూట్‌లో ఈడీలక్స్ బస్సులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్–నిజామాబాద్ రూట్‌లో గురువారం నుంచి ఈడీలక్స్ బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు కరీంనగర్ 2 డిపో మేనేజర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 4 గంటల నుంచి 6.30 వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి 3.30 వరకు ప్రతీ 30 నిమిషాలకు ఒక బస్సు ఉంటుందని అన్నారు. ఈ బస్సుల్లో ప్రయాణికులకు 10శాతం రాయితీతో పెద్దలకు రూ.230, పిల్లలకు రూ.130 చార్జి ఉంటుందని తెలిపారు.

### ఎల్‌ఎల్‌బీ 4వ సెమిస్టర్ విద్యార్థులకు ప్రత్యేక బ్యాక్‌లాగ్ అవకాశం

కరీంనగర్‌క్రైం: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎల్‌ఎల్‌బీ నాల్గో సెమిస్టర్ విద్యార్థులకు బ్యాక్‌లాగ్ పరీక్ష ప్రత్యేక రుసుముతో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎగ్జామినేషన్ కంట్రోలర్ డి.సురేశ్‌కుమార్ తెలిపారు. జూన్ 3వ తేదిలోగా తమ కళాశాలల్లో ప్రతీ పేపర్‌కు రూ.1500 లు చెల్లించాలని పేర్కొన్నారు.

### ఎస్‌యూలో మొదటిదశలో 5,931 డిగ్రీ సీట్ల భర్తీ

కరీంనగర్‌క్రైం: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని దోస్త్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 5,931 డిగ్రీ కోర్సుల సీట్ల భర్తీ జరిగింది. ఎస్‌యూ పరిధిలో మొత్తం 36,540 సీట్ల ఉండగా మొదటి దశలో 5,931 సీట్లు భర్తీ కాగా 30,609 సీట్లు ఖాళీగా మిగిలాయి. 13 ప్రభుత్వ కళాశాలల్లో 297 సీట్లు భర్తీకాగా, 3 ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలల్లో 2,047 సీట్లు భర్తీ అయ్యాయి. ఇదిలా ఉండగా 60 ప్రైవేట్ కళాశాలల్లో కలిపి 3,587 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరిగింది. మొదటిదశలో సీట్లు పొందిన వారు జూన్ 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీట్లు రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుంది.



# ట్రిపుల్ ఐటీ దరఖాస్తులకు వేళాయె..

- ఈనెల 31 నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరణ


బాసర విద్యాలయం

కరీంనగర్: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ)పరిధిలోని బాసర ట్రిపుల్ ఐటీలో 2025–26 విద్యా సంవత్సరం (1,500 మంది) ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో రెగ్యులర్ విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి రెసిడెన్షియల్ ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు సీట్లను భర్తీ చేస్తారు.

**ఫీజుల వివరాలు**

రాష్ట్ర పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఏడాదికి రూ.36 వేల ఫీజు చెల్లించాలి. ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన వారు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రవేశ సమయంలో ఆరోగ్యబీమా, ఇతరాలకు సంబంధించి రూ.3,500 ఇతరులకు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.3,000 చెల్లించాలి. క్యాషన్ (దీనిని తిరిగి ఇస్తారు) డిపాజిట్ కింద ఏ కేటగిరి అభ్యర్థులైనా రూ.2,000 చెల్లించాలి. ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల్లో పని చేసే వారి పిల్లలు ఏడాదికి రూ.1.36 లక్షలు, ఎన్‌ఆర్‌ఐ విద్యార్థులు రూ.3 లక్షలు ట్యూషన్ ఫీజు చెల్లించాలి. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ–సేవ, మీ– సేవ, టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు రుసుం రూ.500, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు రూ.450, వేరే రాష్ట్రం వారు రూ.1,500 చెల్లించాలి.

**ప్రవేశాల షెడ్యూల్, అర్హతలు**

- ఈనెల 31 నుంచి జూన్ 21 వరకు దరఖాస్తుల స్వీకరణ, వికలాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, గ్లోబల్ కేటగిరీకి చెందిన వారికి 25 వరకు అవకాశం.
- జూలై 4న ఎంపిక జాబితా విడుదల, 7న తొలి విడత కౌన్సెలింగ్.
- విద్యార్థులు ప్రథమ ప్రయత్నంలో 2025–ఎస్సెస్సీ తత్సమాన పరీక్షలో రెగ్యులర్‌గా ఉత్తీర్ణులై ఉండాలి.
- 31–12–2024 నాటికి 18 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 21 ఏళ్లు నిండకూడదు.
- పదో తరగతిలో మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు.
- నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారి జీపీఏకు 0.4 డిప్రివేషన్ స్కోర్‌ను అదనంగా కలుపుతారు.
- బాసర ట్రిపుల్‌ఐటీలో 85శాతం సీట్లను స్థానికంగా, మిగిలిన 15 శాతం సీట్లను మెరిట్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులకు కేటాయించారు.
- ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6, బీసీ–ఏ 7, బీసీ–బీ 10, బీసీ–సీ 1, బీసీ–డీ 7, బీసీ–ఇలకు 4 శాతం రిజర్వేషన్ ఉంటుంది.
- ప్రత్యేక సీట్ల కింద వికలాంగులకు 3 శాతం, సైనికోద్యోగుల పిల్లలకు 2, ఎన్‌సీసీ విద్యార్థులకు 1, స్పోర్ట్స్ కోటా కింద 0.5 శాతం సీట్లను భర్తీ చేస్తారు.
- 33.33 శాతం సీట్లను సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారు.
- తెలుగు రాష్ట్రాల విద్యార్థులే కాకుండా వేరే రాష్ట్రాల వారికి, అంతర్జాతీయ విద్యార్థులకు, గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న వారి పిల్లలకు అదనపు సీట్లు కేటాయిస్తారు.
- విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యాలతో పాటు, రెండు జతల యూనిఫాం, షూలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారు.

# కనిపించని తనిఖీలు


ఓ హోటల్‌లో కుళ్లిన ఆలుగడ్డలు


ఓ హోటల్‌లో కుళ్లిపోయిన చికెన్

- హోటళ్లలో తాండవిస్తున్న అపరిశుభ్రత
- కొరవడిన ఆహారభద్రత అధికారుల పర్యవేక్షణ
- ప్రజారోగ్యంతో నిర్వాహకుల చెలగాటం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో రెండు రోజుల క్రితం ఇడ్లీ, వడ, దోశ తిన్న బాధితులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. వారికి వాంతులు, విరోచనాలతో పాటు, కడుపునొప్పి తీవ్రంగా రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. బాధితులు ఫిర్యాదు చేస్తే అధికారులు వచ్చి హోటల్‌ను సీజ్ చేశారు. జిల్లా కేంద్రంలో ప్రతి హోటళ్లలో ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో ఏకంగా ఇడ్లీలో జెర్రీ, బొద్దింక రాగా.. చపాతిలో ఫంగస్ వచ్చింది. బాధితులు ఫిర్యాదు చేద్దామంటే అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఎవరికి చేయాలో తెలియక ఊరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆహార భద్రత శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో పరి శుభ్రతతోపాటు, నాణ్యత లోపిస్తోంది. అధికారులు తనిఖీలు చేయకపోవడంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అపరిశుభ్రత వంటగదులు, మురికినీటితో వంటపాత్రలు శుభ్రం చేయడం, దుర్వాసన వచ్చే గ్లాసులు, ఇలా ప్రతి హోటల్‌లో దర్శనం ఇస్తున్నాయి. జిల్లాలో ప్రతి హోటల్‌లో మాస్టర్లు, సర్వర్లు, పనిచేసే వారు ఆప్రాన్లు, గ్లౌసులు మచ్చుకు కూడా కన్పించవు. ఆహారంలో వెంట్రుకలు రావడం, ఇతరత్రా పదార్థాలు రావడంతోపాటు చట్నీ దుర్వాసన రావడం మామూలుగా మారింది. రోజుల తరబడిన వినియోగించిన నూనెను మళ్లీమళ్లీ వాడడం పరిపాటిగా మారింది. కోళ్ల వ్యర్థాలు, కళేబరాలు, ఎముకలతో తయారుచేసిన నూనె విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**తనిఖీలు లేకనే..**

జిల్లా కేంద్రంలో హోటళ్లు, రెస్టారెంట్లలో టిఫిన్ సెంటర్లలో అధికారులు తనిఖీ చేయకపోవడంతో వారు ఆడిందే ఆటగా మారింది. గతంలో తనిఖీ చేసే సమయంలో కుళ్లిన చికెన్, మటన్ ఇతరత్రా పదార్థాలు లభ్యమైతే అప్పటి వరకు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇటీవలే తహసీల్ చౌరస్తాలో ఉన్న ఓ హోటల్‌లో ఇడ్లీలో బొద్దింక, చపాతిలో ఫంగస్, ఇడ్లీలో జెర్రీ వచ్చిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు వచ్చి నామమాత్రంగా సీజ్ చేశారు. మరుసటి రోజు నుంచే ఆ హోటల్ ప్రారంభమైంది. శుభ్రత లేకపోవడం, ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించడం లేదని తనిఖీల్లో వెల్లడి అవుతున్నా నామమాత్రపు కేసులు పెడుతూ మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

**నిబంధనలు గాలికే..**

నిబంధనల ప్రకారం ఏ రోజు పదార్థాలను ఆ రోజే విక్రయించాలి. ఒకసారి వినియోగించిన నూనెను మరోసారి వాడరాదు. అయినప్పటికీ రోజుల తరబడి అదే నూనెను వాడుతున్నారు. భోజనాలు, టిఫిన్లు తయారుచేసే ప్రాంతాల్లో వంటగదులు శుభ్రంగా ఉండాలి. హోటళ్లలో ఒక వైపు ఎలుకలు, మరో వైపు బల్లులు, జెర్రీలు, బొద్దింకలు, పందికొక్కులు సంచరిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మిగిలిన ఆహారం, చట్నీని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మళ్లీ మరుసటి రోజు దానినే వడ్డిస్తున్నారు. అవి తిన్న బాధితులకు ఫుడ్ పాయిజన్ అవుతోంది.

**ఫోన్లు ఎత్తని అధికారులు**

హోటల్స్, రెస్టారెంట్లలో ఏదైనా సమస్య ఎదురైతే ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫోన్ చేస్తే అందుబాటులో ఉండడం లేదు. జిల్లా అధికారి కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొంది.

# నిరుపేదల సొంతింటి కల సాకారం


పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్

మల్యాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో నిరుపేదల సొంతింటి కల సాకారమవుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలకేంద్రంలో గురువారం 303మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ అర్హులందరికీ సొంతింటి కలను నిజం చేస్తామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన మేరకే ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. జియో ట్యాగింగ్ చేసిన స్థలంలో మాత్రమే నిర్మాణం చేపట్టాలన్నారు. తహసీల్దార్ వసంత, మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి, ముత్యాల రాంలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నీటి సంపులో పడి చిన్నారి మృతి


శ్రీహర్షిక(ఫైల్)

మానకొండూర్: మండలంలోని నిజాయతీగూడెం గ్రామానికి చెందిన తుమ్మనపల్లి శ్రీహర్షిక(3) గురువారం ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తుమ్మనపల్లి ప్రసాద్ కుమార్తె శ్రీహర్షిక ఇంటినుంచి ఆడుకుంటూ వెళ్లి కచ్చకాయల రామయ్య ఇంటి సమీపంలోని నీటి సంపులో ప్రమాదవశాత్తు పడిపోయింది. శబ్దం వినబడటంతో రామయ్య ఇంటి నుంచి బయటకు వచ్చి బాలికను చూసి కేకలు వేశాడు. కొందరు సంపులోకి బాలికను బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సంజీవ్ వివరించారు.

# అంజన్న ముడుపుల ఆదాయం రూ.1,65,641


ఆదాయం లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

మల్యాల: కొండగట్టులో ఈనెల 20నుంచి 22 వరకు నిర్వహించిన హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా దీక్షాపరులు స్వామివారికి సమర్పించిన ముడుపులను ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.1,65,641 సమకూరిందని అధికారులు తెలిపారు. ఆలయ పర్యవేక్షణ అధికారి ఎం.రాజమౌళి, ఆలయ ఇన్స్‌పెక్టర్లు టి.శ్రీనివాస్, జి.సుధాకర్ రెడి పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం


పీహెచ్‌సీలో మందులు పరిశీలిస్తున్న వైద్యాధికారి

మెట్‌పల్లిరూరల్: ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన పలువురితో వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు, మందుల స్టాక్ పరిశీలించారు. క్షయ సంబంధిత కేసులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి, ఇతరత్రా విషయాలు తెలుసుకున్నారు. ఫీవర్ సర్వే, దోమలతో కలిగే వ్యాధులను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేయించేలా కృషి చేయాలని సూచించారు. వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో సమీక్షించారు. మండల వైద్యాధికారి ఎల్లాల అంజిత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్


పాల్గొన్న పోలీస్ అధికారులు

- నకిలీ విత్తనాలు అరికట్టేందుకు ప్రత్యేక నిఘా
- బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి
- నేర సమీక్షలో ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం నేర సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల పురోగతి, తాజా నేరాల విశ్లేషణ, నేరాల నివారణకు చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, రాత్రివేళల్లో గస్తీ బలోపేతం, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలపై సమీక్షించారు. బక్రీద్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గోవధ, గోవుల అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. గోదావరి పరీవాహక రైతులకు నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసి అమ్మకాలపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీలు వెంకటరమణ, రఘుచందర్, రాములు, రంగారెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

- ఎమ్మెల్సీ మల్క కొమురయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని, నాణ్యమైన విద్య అందించడానికి కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాలను గురువారం సందర్శించారు. అభ్యాసన సామర్థ్యాలను పెంచుకుని పాఠశాలల్లో బోధించాలన్నారు. ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డీఈవో రాము మాట్లాడుతూ జిల్లాలో సమర్థవంతంగా పాఠశాలల్లో బోధన నడుస్తోందని, మరింత మెరుగుపర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయినందుకు భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. సెక్టోరియల్ అధికారులు కొక్కుల రాజేశ్, సత్యనారాయణ, బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు, నరేందర్‌రావు, ఒడ్నాల రాజశేఖర్, మచ్చ శంకర్ పాల్గొన్నారు.

### మోసం చేసిన వారిని తిరిగి పార్టీలో చేర్చుకోం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు


మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: బీఆర్‌ఎస్‌ను వీడి ఇతర పార్టీలోకి వెళ్లిన వారు తిరిగి వస్తే చేర్చుకునే ప్రసక్తి లేదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు స్పష్టం చేశారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్‌లో పదవులతోపాటు ఎన్నో రకాల ప్రయోజనాలు పొందిన కొందరు ప్రభుత్వం మారిన తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడి ఇతర పార్టీలోకి వెళ్లారని, అలాంటి వారు ఆ పార్టీల్లో ఇమడలేక తిరిగి బీఆర్‌ఎస్‌లోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని, వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ చేర్చుకోబోమన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసే వారికి తప్పకుండా తగిన గుర్తింపు ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకపోవాలన్నారు. సమావేశంలో పట్టణాధ్యక్షులు చంద్రశేఖర్‌రావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

### షరతుల్లేకుండా పథకాలు అందించాలి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత


మాట్లాడుతున్న దావ వసంత

రాయికల్: నిరుద్యోగులకు సంక్షేమ పథకాలను షరతులు లేకుండా అమలు చేయాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాయికల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కేవలం అరగుంటకే పరిమితం చేశారని, సిబిల్ స్కోర్ ఉన్న నిరుద్యోగులకే యువ వికాసం అమలు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పథకాల అమలులో జాప్యం చేయడం కోసమే ఇలాంటి షరతులు పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్‌కుమార్, మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్, కో–ఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఎనగందుల ఉదయశ్రీ, మారంపల్లి రాణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అల్లిబిల్లి సోకులాడి సిట్టమ్మి

- ఇటు చదువు.. అటు పాటలు
- జానపదగేయాలతో రాణిస్తున్న కట్కూరి స్నేహ
- 40కి పైగా పాటలు రాసిపాడిన యువతి


పాటలు పాడుతున్న స్నేహ

‘దూసుకోను దువ్వెన తెమ్మంటది..
చూసుకోను అద్దం తెమ్మంటది..
కాటుక తెమ్మంటది.. కాళ్లకు పెట్టుమంటది..
అల్లిబిల్లి సోకులాడి సిట్టమ్మి..’

**‘బావో నా బంతి పూల దండ.. నిన్న చూస్తుంటే నా గుండెల గుదిబండ..’ అంటూ స్నేహ పాడితే యువత గుండెలు జారిపోతున్నాయి. ప్రస్తుతం సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతున్న ఈ జానపద పాటలను రాసి, పాడింది రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన కట్కూరి స్నేహ. చదువుకుంటూనే పాటలు రాస్తున్న యువజానపద గాయనీ గురించి తెలుసుకుందాం..**

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని వంతడుపుల గ్రామానికి చెందిన కట్కూరి స్నేహ కరీంనగర్‌లో ఎంఫార్మసీ చదువుతోంది. ఇప్పటి వరకు 40కి పైగా జానపద గేయాలు రాసి, పాడింది. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న పాటల్లో చాలా మటుకు స్నేహ రాసి, పాడినవే. హైస్కూల్‌లో చదువుతున్న రోజుల్లో బాలల దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో నిర్వహించిన పాటల పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచింది. ఈ పోటీలు ఆమెను పాటలు పాడడం వైపు మళ్లించాయి. బీ ఫార్మసీ చదువుతుండగా తనకు పాటలు రాయాలనే ఆలోచన వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 40కి పైగా పాటలు, రాసి పాడింది. శేఖర్ మాస్టర్ కావాలంటే ఇటీవల రాసి, పాడిన ‘అల్లిబిల్లి సోకులాడి సిట్టమ్మి..’ పాట మంచి పేరు తెచ్చిందని పేర్కొంది. చదువుకుంటూనే పాటలు రాస్తానని స్నేహ చెప్పింది. సినిమా పాటలు పాడాలనేది తన జీవిత ఆశయమని పేర్కొంది.

# శాతవాహనలో న్యాయ విద్య

- ఎల్‌ఎల్‌బీలో 120, ఎల్‌ఎల్‌ఎం 20 సీట్లు
- రూ.22కోట్లతో భవన నిర్మాణ, మౌలిక సదుపాయాలు
- త్వరలో 35 మంది టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ రిక్రూట్‌మెంట్
- ఈ అకడమిక్ నుంచి తరగతులు ప్రారంభం



ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన శాతవాహన లా కళాశాల

| కోర్సు | సెక్షన్లు | సీట్లు |
|---|---|---|
| ఎల్‌ఎల్‌బీ | 2 | 120 |
| ఎల్‌ఎల్‌ఎం | 1 | 20 |

కరీంనగర్‌క్రైం: లా చదవాలనే విద్యార్థులు కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ న్యాయ కళాశాల లేకపోవడంతో చాలా ఇబ్బందులుపడ్డారు. కాగా, ఇటీవల శాతవాహన యూనివర్సిటీకి న్యాయ కళాశాల మంజూరు కావడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

**బీసీఐ నుంచి గ్రీన్‌సిగ్నల్**

దేశవ్యాప్తంగా ఎక్కడ లా కళాశాల ఏర్పాటు చేయాలన్నా స్థానిక ప్రభుత్వ అనుమతితో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) అనుమతి కీలకం. ఈనేపథ్యంలో శాతవాహన యూనివర్సిటీలో ఏర్పాటు చేయాలని 11 నవంబర్ 2024న వైస్ చాన్స్‌లర్ నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. ఈక్రమంలో శాతవాహనలో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం తరగతులు నిర్వహించేందుకు ఫిబ్రవరి 2025లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు జారీ చేసింది. దీంతో ఎల్‌ఎల్‌బీ తరగతులకు సంబంధించిన పనులు చకచకా జరిగిపోతున్నాయి. న్యాయకళాశాల భవన నిర్మాణం, ఇతరత్రా అవసరాలకు సుమారు రూ.22 కోట్లు మంజూరయ్యాయి. భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని మొదటి అంతస్తులో తరగతులు నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల టీచింగ్, నాన్‌టీచింగ్ కోసం 35 పోస్టులు అవసరం ఉండడంతో వీటి కేటాయింపునకు కేబినెట్‌లో ఆమోదం తెలుపాల్సి ఉంటుంది. కేబినెట్ సమావేశం కాగానే పోస్టుల భర్తీ జరుగుతుందని యూనివర్సిటీ వర్గాలు భావిస్తున్నాయి.

**పట్టా చేతిలో ఉంటే పుట్టెడు మార్గాలు**

ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పట్టా చేతిలో ఉంటే ఉపాధికి పుట్టెడు మార్గాలుంటాయి. సొంతంగా ఎవరి మీద ఆధారపడకుండా లా ప్రాక్టిస్ చేసుకోవడంతో పాటు వివిధ కంపెనీలకు లీగల్ అడ్వైజర్లుగా ఉండడం, జిల్లా జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇలా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇవే కాకుండా ఇతర శాఖల్లో కూడా లా చదివిన వారిని వివిధ కమిషన్ మెంబర్లు, కమిటీ మెంబర్లుగా నియమితులయ్యే అవకాశాలున్నాయి. ఎల్‌ఎల్‌ఎం చేసిన వారు ఎల్‌ఎల్‌బీ తరగతులు చెప్పడంతోపాటు ఇతర అవకాశాలు ఉండడంతో చాలా మంది న్యాయవిద్యపై ఆసక్తి చూపిస్తున్నారు. శాతవాహన యూనివర్సిటీ వ్యాప్తంగా లా కాలేజీలు రెండు మాత్రమే అవి కూడా ప్రైవేట్ కళాశాలలు మాత్రమే నడిపిస్తున్నాయి. ఇప్పుడు ఎస్‌యూలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటు కావడంతో ఇక్కడి ప్రాంత విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని విద్యార్థి సంఘాల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

**ఈ సంవత్సరం నుంచి తరగతులు**



శాతవాహన యూనివర్సిటీకి న్యాయ కళాశాల మంజూరైంది. ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ఆర్ట్స్ కళాశాలలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభిస్తున్నాం. భవనాలు నిర్మించిన తర్వాత శాశ్వతంగా ప్రత్యేక వసతి సౌకర్యాలు ఉంటాయి.

– ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్, శాతవాహన వీసీ